సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



దోమ/పరిగి, అక్టోబర్ 22: సీఎం సహాయనిధి పేదలకు వరం వంటిదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి మండల పరిధిలోని బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన బలగ సౌందర్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందింది. మంగళవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరిగిలోనితన నివాసంలో రూ. 60,000 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును సౌందర్యకు అందజేశారు. కాగా పరిగి పట్టణంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో హన్మంతుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ గ్రామస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు

పెద్దేముల్, అక్టోబర్ 22 : మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో వికారాబాద్ శ్రీ మహావీర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచితమెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిని హన్మాపూర్ మాజీ సర్పంచ్ లొంక నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 180 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లొంక రాములు, మహేశ్, సురేశ్, దేవి సింగ్, యాలాటి శ్రీనివాస్, ప్రవీణ్, రామకృష్ణ, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని భోజన విరామ సమయంలో ఆందోళన

పెద్దేముల్‌లోని బాలుర ఉన్నత పాఠశాల ముందు.

దోమ: కిష్టాపూర్ ఉన్నత పాఠశాల ముందు..

తాండూరు రూరల్: చెంగోల్ జడ్పీహెచ్ఎస్ ముందు..

బషీరాబాద్‌లో..

తాండూరు రూరల్, అక్టోబర్ 22: పెండింగ్‌లో ఉన్న ఐదు డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలంటూ మంళవారం భోజన విరామ సమయంలో తపస్ (టీపీయూఎస్) రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్షను చేపట్టారు. తాండూరు మండలం, చెంగోల్ జడ్పీ హెచ్ఎస్ లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తాండూరు మండల అధ్యక్షుడు సుంకరి రవికుమార్, ప్రధాన కార్యదర్శి కర్ణం వినోద్‌కుమార్, జిల్లా బాధ్యులు మాణిక్‌రావు, ఆందన్, బాలబోయిన కవిత ఉన్నారు

పెద్దేముల్: డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తపస్ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీ లతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు రాజేశ్, సంతోష్, రాష్ట్ర బాధ్యులు ఆనందం,జిల్లా బాధ్యులు గాజుల బస్వరాజ్, వడిచర్ల సత్యం,ప్రభాకర్ రావు, సంతోష్, మహేశ్, అనిల్ పాల్గొన్నారు.

దోమ: మండల పరిధిలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో దోమ మండల ఉపాధ్యా సంఘం (తపస్) తరపున పాఠశాల ముందు తమ డిమ్యాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ ఉపాధ్యా బృందం నల్ల బ్యాడ్జీలు ధరించి సామూహిక నిరసన కార్యక్రమం చేపట్టారు. నెరవేర్చ యోగ్యమైన డీఏలు,పీఆర్‌సీ,ఈ -కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు చెల్లించే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి మహేంద్ర బహదూర్,ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి,మండల శాఖ బాధ్యుడు కృష్ణ మూర్తి, హెచ్ఎం లాల్యనాయక్ ,ఉపాధ్యాయులు సూరి, శ్రీశైలం, వెంకటాచారి, శ్రీనివాస్, భీమ్యనాయక్,శ్రీలత పాల్గొన్నారు.

బషీరాబాద్ : పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీపీయూఎస్(తెలంగాణ ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మండలంలోని పలు పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు గాజుల వీరేశం, రవికుమార్, కవిత, శోభ, అనిల్‌కుమార్, శ్రీనివాస్, గీతాశ్రీ, నర్సింహులు, హరీశ్, సేవ్యానాయక్, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తాం

మర్పల్లిలో మార్కెట్ కమిటీ పాలకవర్గంతో నాయకులు

మర్పల్లి, అక్టోబర్ 22: దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ లోనే విక్రయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ సూచించారు. నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన మార్కెట్ పాలకవర్గం మంగళవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ప్రతి మంగళవారం పశువుల సంత జరిగేదని కరోనా సమయం నుంచి సంత నిలిచిపోయిందని, మళ్లీ పునఃప్రారంభం చేస్తామన్నారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఏమైనా సమస్యలు ఉంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. మర్పల్లి, బంట్వారం, మోమిన్‌పేట్ మండలాల నాయకులు పాలక వర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో మర్పల్లి, బంట్వారం మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేశ్ యాదవ్, వెంకటేశం, సీనియర్ నాయకులు రాములు యాదవ్, కృష్ణారెడ్డి, రామేశ్వర్, రాచయ్య, ఎం.సురేశ్, మహేశ్, సురేశ్‌కుమార్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, అబ్ర హం, శ్రీనివాస్, నర్సింహులు, డైరెక్టర్లు నిర్మాలాబాయి, యాదగిరి, నర్సింహులు, రాజు పాల్గొన్నారు

పీడీఎస్‌యూ సభను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్యూ రాష్ట్ర కార్యదర్శి వై.గీత

వికారాబాద్, అక్టోబర్ 22 : పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా గురువారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే అర్ధ శతాబ్దోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సరస్వతీ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్నాహాక సభ నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి వై.గీత మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఇచ్చిన స్ఫూర్తితో విద్యార్థులు తమ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బొజ్జి శ్రీకాంత్, బి. మహేందర్, నవీన్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

కులకచర్ల, అక్టోబర్ 22: కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు హెల్త్ అసిస్టెంట్ తెలిపారు. ఆర్సీకృషి, ఆర్సీ గ్లోబల్ చాంపియన్స్ ఎంఎన్‌జే హాస్పిటల్స్, ఆసరా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ క్యాంపును నిర్వహిస్తున్నారని, ఉదయం 10 నుంచి సాయం త్రం 4గంటల వరకు క్యాంపు కొనసాగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

వికారాబాద్, అక్టోబర్ 22 : పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్న ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ భీమ్‌కుమార్ కథనం ప్రకారం.. వికారాబాద్ , టాస్క్‌ఫోర్స్ పోలీసులు వికారాబాద్ పట్టణం కొంపల్లి సమీపంలో ఒక ఫామ్‌హౌస్ పైన దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.19,250 లు నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, 1కారు , 2 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని, వారిపై వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డీజిల్ ట్యాంకర్ స్వాధీనం

తాండూరు రూరల్, అక్టోబరు 22: కర్ణాటక నుంచి వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను కరణ్‌కోట పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. కర్ణాటకలోని కలబురిగి నుంచి ఓ డీజిల్ ట్యాంకర్ తాండూరు మండల పరిధిలోని ఓ ట్రాన్స్‌పోర్టుకు వస్తోంది. ఈ ట్యాంకర్‌పై అనుమానం వచ్చిన పోలీసులు ట్యాంకర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్యాంకర్‌కు సంబంధించిన సదరు వ్యక్తులు మంగళవారం పత్రాలు తీసుకు వచ్చి ఎస్సై విఠల్‌రెడ్డికి చూయించారు. అన్ని అనుమతులు ఉన్నాయని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో సివిల్ సప్లయ్ అధికారులతో విచారణ చేయిస్తామన్నారు.

ఇరు వర్గాల గొడవ.. కేసు నమోదు

బషీరాబాద్, అక్టోబర్ 22 : ఇరు వర్గాలు గొడవ పడి ఒకరినొకరు కొట్టుకున్న ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఎస్సై గఫార్ తెలిపిన వివరాలు... కొర్విచేడ్ గ్రామానికి చెందిన శేఖర్, శ్రీనివాస్, వెంకటప్ప, మరో వర్గానికి చెందిన శ్రీనివాస్, మల్లప్పలు గ్రామంలో చర్చి వద్ద గొడవ పడి ఒకరినొకరు చేతులతో కొట్టుకుని చంపు తామని బెదిరించుకున్నారన్నారు. దీంతో రెండు వర్గాలకు చెందిన వారు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యం

పెద్దేముల్, అక్టోబర్ 22 : మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడి అదృశ్యమైన ఘటన పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పెద్దేముల్ గ్రామంలో జరిగింది ఎస్ఐ గిరి కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఎర్ర చంద్రశేఖర్ మొదటి కుమారుడు వంశీ కృష్ణ (27) ఈ నెల 21 న మధ్యాహ్నం 1:30 సమయంలో భోజనం చేసి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి మంగళవారం వరకు వస్తాడేమో అని ఎదురు చూసిన తల్లిదండ్రులు, రాత్రి అయినా ఇంటికి రాకపోయేసరికి చుట్టు పక్కల గ్రామాల్లో, స్నేహితుల దగ్గర, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించక పోవడంతో మంగళవారం పోలీసు స్టేషన్‌లో తండ్రి ఎర్ర చంద్రశేఖర్ ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు స్థానిక ఎస్ఐ కె.గిరి తెలిపారు

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

పెద్దేముల్, అక్టోబర్ 22 : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, గ్రామాలను సురక్షితంగా ఉంచడంలో సీసీ కెమెరాలు చాలా ఉపయోగపడుతాయని తాండూరు రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో ఎస్ఐ కె.గిరి ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను అదుపుచేయడంలో, ప్రజలకు రక్షణ, శాంతిభద్రతలను కాపాడడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అందుకు ప్రతి గ్రామంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పెద్దేముల్ ఎస్ఐ కె.గిరి, నాగులపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కొడంగల్, అక్టోబర్ 22 : దుద్యాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సహకారంతో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సమితి సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటిరియల్ అందజేశారు. మంగళవారం బొంరాస్‌పేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేషనల్ మెరిట్ కమ్ స్కాలర్‌షిప్ స్టడీ మెటీరియల్ అందించినట్లు టీవీవీ రాష్ట్ర కార్యదర్శి తెలిపారు. పాఠశాలలోని 45 మంది విద్యార్థులను గుర్తించి వారికి నేషనల్ మెరిట్, స్కాలర్‌షిప్ టెస్ట్‌లకు ఉపయోగపడే తెలుగు, ఇంగ్లిష్ మీడియానికి సంబంధించిన స్కాలర్ షిప్ టెస్ట్‌లో విజయం సాధించే దిశగా స్టడీ మెటిరియల్‌ను అందిజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్ తో పాటు అనిల్‌కుమార్, గోపాల్ రాములు, లక్ష్మి, ప్రశాంత్, మల్లయ్య పాల్గొన్నారు.

పోలీసులకు దంత పరీక్షలు

పోలీసు సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహిస్తున్న శ్రీసాయి దంత వైద్య కళాశాల వైద్యులు

కొడంగల్, అక్టోబర్ 22: కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోలీసులకు దంత పరీక్షలు చేశారు. వికారాబాద్ జిల్లా శ్రీ సాయిదంత వైద్య కళాశాల వైద్యులు, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో బిజీగా ఉండి వారి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం కొంత వరకు ఇబ్బందిగా ఉంటుందని, ఇటువంటి క్యాంపుల ద్వారా వారికి కొంత వరకు వైద్య చికిత్సలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందనే ఉద్దేశ్యంతో క్యాంపు నిర్వహించి దంత పరీక్షలు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శివరాములుగౌడ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

కులకచర్ల, అక్టోబర్ 22: మండల పరిధిలోని ఘనాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన నాయకులు వార్ల అంజనేయులు, వెంకటయ్యగౌడ్ మంగళవారం గ్లాసులు, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

పెద్దేముల్, అక్టోబర్ 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూఎస్ఎఫ్ఐ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు దీపక్ రెడ్డి సమక్షంలో మండల అధ్యక్షుడు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల యూఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్షుడుగా స్వరాజ్, ఉపాధ్యక్షుడుగా భాస్కర్, మహిళా అధ్యక్షురాలుగా స్రవంతి, ఉపాధ్యక్షురాలుగా పూజను విద్యార్థులు, యూఎస్ఎఫ్ఐ యూనియన్ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకుడు శ్రీ రామ్, విద్యార్థులు చరణ్, సంతోష్, కార్తీక్, సానియా, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో ఇరువర్గాల మధ్య దాడి

■ ఐదుగురికి తీవ్రగాయాలు ■ ఏడుగురిపై కేసునమోదు

పోలీస్‌స్టేషన్ ఎదుట పాత కక్షలతో గాయాలపాలైన బాధితులు

కులకచర్ల, అక్టోబర్ 22 : మండల పరిధిలోని అంతారం గ్రామంలో పాత కక్షలతో ఇరు కుటుంబాల మధ్య దాడులు చేసుకోగా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కులకచర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన వ్యక్తి గ్రామానికి చెందిన బోరు దగ్గర నీటిని పట్టుకోవడానికి వెళ్లగా ఆ వ్యక్తితో మరొక వర్గానికి చెందిన వారు గొడవ పడి తిట్టగా ఆ వ్యక్తి ఇంటికి వెళ్లి విషయాన్ని చెప్పగా ఎందుకు తిట్టావని అడిగిన వ్యక్తులను కర్రలు, గొడ్డళ్లతో దాడి చేసినట్లు ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. అంతారం గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు రాత్రి సమయంలో వేపూరి రామయ్య ఇంటిపై దాడి చేశారని, ఇంట్లో ఉన్న చంద్రమౌళి, నారాయణమ్మ, వెంకటయ్య, లావణ్య, శ్రీకాంత్, శరత్, అక్షయలపై దాడులు చేయగా తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. ఇందులో తీవ్రగాయయాలైన చంద్రమౌళి, నారాయణమ్మలను పరిగి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు రామయ్య వర్గంపై దాడులు నిర్వహించి తీవ్రగాయాలు చేసిన ఒక వర్గానికి చెందిన బసయ్య, రాములు, చెన్నయ్య, అనిల్, కావలి శ్రీను, బొల్ల నర్సింహులు, కావలి శ్రీను లపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాలిప్పిస్తానంటూ.. రూ.1.17 కోట్లు స్వాహా

బాధితుల ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): తాను కేంద్ర ప్రభుత్వ కాంట్రాక్టర్‌ను.. తన వద్ద చాలా మందికి ఉద్యోగ అవకాశాలున్నాయి.. అంటూ నమ్మించి రూ.1.17 కోట్లు వసూలు చేసి బిచాణా ఎత్తేసిన ఆర్‌కే గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని ఎం.సురేశ్‌తో పాటు అతడి అనుచరులపై సీసీఎస్‌లో మంగళవారం కేసు నమోదైంది. వనపర్తి జిల్లా, వీపనగండ్లకు చెందిన సురేశ్ సికింద్రాబాద్‌లోని చంద్రలోక్ కాంప్లెక్స్‌లో ఆర్‌కే గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక సంస్థను నిర్వహిస్తున్నాడు. ఈ సంస్థలో ఉద్యోగాలున్నాయంటూ ఓ లోకల్ యాప్‌లో ప్రకటన ఇచ్చారు. ఈ ప్రకటన చూసిన సంద్యాలకు చెందిన షేక్ హుస్సేన్ వలీ సికింద్రాబాద్‌కు వచ్చి సురేశ్‌తో మాట్లాడాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానమంటూ సురేశ్ నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన హుస్సేన్ వలీ యాపీఐ ద్వారా రూ.లక్ష చెల్లించాడు. నాలుగైదు రోజుల్లోనే జాబ్ ఆఫర్ లెటర్‌తో పాటు గుర్తింపు కార్డును ఇచ్చి తన కార్యాలయంలోనే హుస్సేన్‌ను ఉద్యోగిగా నియమించుకొని, నెలకు రూ. 68,500 జీతానికి ఒప్పందం చేసుకున్నాడు. అతడికి మొదటి నెల జీతం కూడా ఇచ్చాడు. దీంతో హుస్సేన్‌కు నమ్మకం కుదిరింది. మరికొందరికి కూడా ఉద్యోగాలిప్పిస్తానంటూ సురేశ్ నమ్మించాడు. దీంతో తన స్నేహితులు, బంధువులైన 12 మందిని అతడికి పరిచయం చేయించాడు. వారంతా కలిసి రూ. 1.17 కోట్లు సురేశ్‌కు ఇచ్చారు. అందరికీ ఆఫర్ లెటర్ ఇచ్చి.. కొన్నాళ్లు వారికి తన సంస్థలోనే శిక్షణ ఇచ్చాడు. అనుమానం రాకుండా కొందరికి జీతాలు సైతం ఇచ్చాడు. చివరకు కార్యాలయానికి తాళం వేసి బిచాణా ఎత్తేశాడు. బాధితులు సురేశ్ స్వగ్రామానికి వెళ్లి అతడి కుటుంబ సభ్యులను కలిశారు. ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెయింటర్స్ అసోసియేషన్ ..

దోమ, పరిగి,అక్టోబర్ 22: ఫ్రెండ్స్ యూత్ పెయింటర్స్ అసోసియేషన్ నాయకుడు బాలరాజు అధ్యక్షతన పరిగి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పెయింటర్స్ కార్మికుల సమావేశం నిర్వహించి పరిగి నియోజకవర్గ పెయింటర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా సునీల్‌కుమార్(కన్నా),ఉపాధ్యక్షుడిగా యాదయ్య,కార్యదర్శిగా జంగయ్య, సలహాదారులుగా వెంకటేశ్, శ్రీనివాస్, కోశాధికారులుగా బాలరాజు,బాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో రూ.2.65 కోట్ల మోసం..

నిర్వాహకుడి అరెస్టు

సిటీబ్యూరో, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ): చిట్టీల పేరుతో రూ. 2.65 కోట్లు మోసం చేసి బిచాణా ఎత్తేసిన కుత్బుల్లాపూర్‌కు చెందిన మలినేని సీతరామయ్యను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం మంగళవారం అరెస్ట్ చేసింది. ఈవోడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం.. సీతారామయ్య, తన అల్లుడు మురళీకృష్ణతో కలిసి స్థానికంగా సోమశేఖర ఫిన్‌కార్ప్ పేరు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా 30 ఏండ్లుగా నెలవారీ చిట్టీలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా అందరి నమ్మకాన్ని పొందారు. దీంతో చాలా మంది వీళరి వద్ద లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు చిట్స్ వేస్తున్నారు. నిందితులు చిట్స్ పేరుతో పలువురి వద్ద నుంచి రూ. 2,65,94,670 సేకరించారు. జూలై నెలలో చిట్స్ ఆపేస్తున్నామని, మీ వద్ద తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేస్తామంటూ నమ్మించి అక స్మాత్తుగా ఇల్లు ఖాళీ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బాధితులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ విభాగానికి ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏపీలోని నందిగామ వద్ద ప్రధాన నిందితుడు సీతరామయ్యను మంగళవారం అరెస్ట్ చేశారు.

మైసమ్మ ఆలయానికి విరాళం..

ధారూరు, అక్టోబర్ 22: మండల పరిధిలోని గడ్డమీది గంగారం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠాపించిన మైసమ్మ దేవాలయానికి రూ.11వేలు విరాళాన్ని వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్ల నందు ఆలయ సభ్యులకు మంగళవారం అందజేశారు.కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచులు అమర్నాథ్, చంద్రయ్య, నాయకులు రాజేందర్ గౌడ్, కొండాపూర్‌కలాన్ మాజీ సర్పంచ్ పరమేశ్ తదితరులు ఉన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు బెయిల్

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో మనోరంజన్ కోర్టు ప్రాంగణంలోని 5వ ప్రత్యేక జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ మంగళవారం గ్రూప్-1 అభ్యర్థులకు బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో ఉన్న అనుములపురి జనార్దన్, ననావత్ రవి రాథోడ్, ఎల్.సురేశ్, ఎం.దామోదర్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ఎదుట హాజరుపర్చారు. సీపీ యాక్టు 70బీ, 71, 21, 76 సెక్షన్లు విద్యార్థులకు వర్తించవని, రిమాండ్‌కు తరలించరాదని న్యాయవాది లక్ష్మణ్ కోర్టుకు వాదనలు వినిపించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 29తో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన చేశారని, అనవసరంగా సెక్షన్లను జోడించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. న్యాయవాది వాదనలను ఏకీభవించిన కోర్టు.. ఒక్కొక్కరికీ రూ. 5 వేల చొప్పున పూచీకత్తు విధిస్తూ.. కోర్టుకు సమర్పించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నలుగురి తరపున జమానత్‌లను కోర్టుకు సమర్పించడంతో విడుదలయ్యారు.